రాష్ట్రపతిని కలిసేందుకు కాంగ్రెస్ సన్నద్ధం

బెంగళూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): 'ముడా' ఇంటి స్థలాల వివాదంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్యను ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వడంపై రాష్ట్రపతిని కలిసేందుకు కాంగ్రెస్ సన్నద్ధమవుతోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేల కూటమి రాష్ట్రపతి ద్రౌపదిముర్మును భేటీ అయి గవర్నర్ నిర్ణయానికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేయనున్నట్లు హోంశాఖ మంత్రి పరమేశ్వర్ తెలిపారు. రాష్ట్రపతిని కలిసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. గురువారం కోర్టు ద్వారా వచ్చే నిర్ణయాలను పరిగణించి తదుపరి కార్యాచరణ చేయనున్నామని అన్నారు. 31న చలో రాజ్‌భవన్‌కు పిలుపునిచ్చామని తెలిపారు.

అందరి దృష్టి హైకోర్టు తీర్పుపైనే..!

- నేడు సీఎం ప్రాసిక్యూషన్‌పై నిర్ణయం
- రాహుల్‌గాంధీతో ప్రత్యేక చర్చలు వాస్తవమే : హోంశాఖ మంత్రి
- కోర్టు తీర్పు ఏదైనా సీఎంకు అండగా అధిష్టానం



కర్ణాటక హైకోర్టు



బెంగళూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) ఇంటి స్థలాల వివాదంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇచ్చిన కేసుకు సంబంధించి అనుక్షణం ఉత్కంఠగా మారుతోంది. గురువారం హైకోర్టులో ప్రాసిక్యూషన్‌కు అనుమతులపై నిర్ణయం వెలువడాల్సి ఉంది. గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వడంతో రాష్ట్రమంతటా కాంగ్రెస్‌లో అలజడి నెలకొంది. సీఎం సిద్దరామయ్య పరిస్థితి దోలాయమానంలో పడింది. రాష్ట్రమంత్రివర్గం తర్జనభర్జనకు గురైంది. పది రోజుల కిందట కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, రణదీప్‌సింగ్ సుర్జేవాలా హుటాహుటిన బెంగళూరుకు వచ్చి సీఎంకు ధైర్యం చెప్పారు. ఈలోగా హైకోర్టులో గవర్నర్ ప్రాసిక్యూషన్ అనుమతులపై పిటిషన్ దాఖలు చేయగా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపించేందుకు రాగా కపిల్‌సిబల్ సైతం అందుబాటులోనే ఉన్నారు. ఈ వివాదం పదిరోజుల వాయిదా పడింది. ఈలోగా సీఎం, డీసీఎం అధిష్టానం పెద్దలతో కలసి సుదీర్ఘ మంతనాలు జరిపారు. సీఎంకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అదే ధీమాతో సీఎం సిద్దరామయ్య మూడు నాలుగు రోజులుగా ఉత్సాహంగా ఉంటున్నారు. గురువారం హైకోర్టులో కేసుకు సంబంధించిన నిర్ణయం ఉండడంతో అందరిచూపు ధర్మాసనంవైపే ఉంది. కోర్టు ఏ విధమైన తీర్పు ఇవ్వనుందనేది ఉత్కంఠగా మారింది. ముఖ్యమంత్రి గురువారం కార్యక్రమాలకు సంబంధించి ఎలాంటి షెడ్యూల్ ప్రకటించలేదు. దీన్నిబట్టి కోర్టు కేసుకు సంబంధించి ఎదురుచూస్తున్నట్లు కనిపిస్తోంది. శుక్రవారం ముఖ్యమంత్రి హావేరి జిల్లా రాణిబెణ్ణూరు తాలూకా దేవరగుడ్డను సందర్శించనున్నారు. ఒకవేళ కోర్టు ప్రాసిక్యూషన్‌కు అనుమతులిస్తే రాష్ట్ర రాజకీయాలు మలుపులు తిరగవచ్చు. అధిష్టానం వ్యవహరిస్తున్న విధానం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల ఢిల్లీ వెళ్లిన సీఎం, డీసీఎంతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, రణదీప్‌సింగ్ సుర్జేవాలా సుదీర్ఘంగా చర్చించారు. చట్టపరంగా ఎదుర్కొందామని భరోసా ఇచ్చారు. ఇదంతా బాగానే ఉన్నా హోంశాఖ మంత్రి పరమేశ్వర్‌తో రాహుల్‌గాంధీ ప్రత్యేకంగా చర్చలు జరపడం కొత్త ట్విస్ట్‌గా మారింది. అదే రోజు నుంచే పరమేశ్వర్ కీలక నేతలతో రహస్య చర్చలు సాగించారు. బుధవారం బెంగళూరులో పరమేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ అగ్రనేత రాహుల్‌గాంధీతో ప్రత్యేక చర్చలు జరిపింది వాస్తవమేనని అంగీకరించారు. ఈ విషయమై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాహుల్‌గాంధీతో చర్చించిన అంశాలు బహిరంగం చేయలేనని పరమేశ్వర్ స్పష్టం చేశారు. కోర్టు నిర్ణయం ఏదైనా సీఎం సిద్దరామయ్యకు అధిష్టానం అండగా ఉంటుందన్నారు. నాయకత్వ మార్పు ఉంటుందా..? అని మీడియా అడిగిన ప్రశ్నకు తాను ఏమీ సమాధానం చెప్పనని, రాహుల్‌గాంధీతో ప్రత్యేకంగా పదినిమిషాలు మాట్లాడానని, తాను కాంగ్రెస్ క్రమశిక్షణ కల్గిన కార్యకర్త అన్నారు. అంతకు మించి చెప్పలేనని దాటవేశారు.



బళ్లారిలో ఈడీ సోదాలు



మాజీ మంత్రి నాగేంద్ర మామ ఎర్రిస్వామి ఇంటి వద్ద ఈడీ అధికారుల వాహనాలు

బళ్లారి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కర్ణాటక వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ.187 కోట్ల అక్రమాల కేసు దర్యాప్తులో భాగంగా బళ్లారిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు బుధవారం సోదాలు చేశారు. మాజీ మంత్రి బి.నాగేంద్ర మామ బి.ఎర్రిస్వామితో పాటు విజయ్‌కుమార్, అల్లాబకాష్, ప్రకాష్, మరో వ్యక్తి ఇళ్లలో సోదాలు చేశారు. ఈడీ అధికారులు సోదాలకు వెళ్లిన సమయంలో ఆ ఇళ్లలో మహిళలు మాత్రమే ఉన్నట్లు సమాచారం. వారితో ఈడీ అధికారులు మాట్లాడి, కొన్ని ఆధారాలు సేకరించారని తెలిసింది. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ బ్యాంకు ఖాతా నుంచి రూ.187 కోట్లు వివిధ ఖాతాలకు అక్రమంగా మళ్లించిన వ్యవహారంలో అప్పటి మంత్రి నాగేంద్రతో పాటు మొత్తం 13 మందిపై కేసు నమోదైంది. వారితోపాటు మరికొందరిని ఈడీ రికార్డుల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో బళ్లారిలోని ఐదుగురి ఇళ్లలో ఈడీ సోదాలు చేసింది.

19వేలకు పైగా బినామీ కంపెనీలు

రాష్ట్రంలో పన్నుల ఎగవేతతో వెలుగులోకి..



బెంగళూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వ్యాపారాలు చేస్తున్నామని చెప్పుకొనే కంపెనీలు రాష్ట్రంలో ఐదేళ్లలో 19,242 కనుమరుగైన విషయం వెలుగులోకి వచ్చింది. ఇటీవలి ఆర్థిక సంవత్సరాలలో వ్యాపార లావాదేవీల వివరాలను ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో చట్టవ్యతిరేకమైన, మోసం చేసేందుకు ఏర్పడిన నకిలీ సంస్థలుగా ప్రాథమికంగా గుర్తించారు. పన్నుల ఎగవేత, అక్రమ ఆర్థిక లావాదేవీలు, బ్లాక్‌మనీని వైట్‌గా మారుస్తామని, చట్టానికి అనుగుణంగా పనిచేస్తున్నట్టు వాణిజ్యపన్నుల శాఖకు చూపేందుకు కంపెనీలు ప్రారంభించి ఆ తర్వాత ఎప్పటికప్పుడు నిర్వీర్యం చేసేస్తున్నట్టు తెలుస్తోంది. 2019-20 నుంచి 2023-24 దాకా రాష్ట్రంలో ఎలాంటి కార్యాచరణ జరపకుండా 19,242 కంపెనీలు ఉన్నట్టు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గుర్తించింది. బోగస్ కంపెనీలకు చట్టబద్ధత ఉండదు. రిజిస్ట్రేషన్ వేళ తప్పుడు చిరునామాలు, యజమాని నుంచి బోర్డు డైరెక్టర్లు అంతా నకిలీ పేర్లతోనే పూర్తిచేస్తారు. అటువంటి కంపెనీలు ప్రజలను మోసం చేస్తుంటాయి. దేశవ్యాప్తంగా ఇటువంటి కంపెనీలు 2.33 లక్షల దాకా ఉండగా రాష్ట్రంలో 19,242 కంపెనీలు ఉన్నాయి. కంపెనీలు ఇన్‌పుట్ ట్యాక్ క్రెడిట్ విషయం ప్రభుత్వం పరిశీలించాల్సిన అవసరం ఉందని ఎఫ్‌కేసీసీఐ ఛైర్మన్ రమేశ్‌చంద్ర లహోటి డిమాండ్ చేశారు.

10 యూనివర్సిటీలకు

సిండికేట్ సభ్యుల నియామకం

బెంగళూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పది యూనివర్సిటీలకు సిండికేట్ సభ్యులను ప్రభుత్వం నియమించింది. వీరు సిండికేట్ సభ్యులుగా మూడేళ్లపాటు కొనసాగుతారు. మహిళ, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీతో పాటు జనరల్ కోటాలో సభ్యులను నియమించారు. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. హంపిలోని కన్నడ విశ్వవిద్యాలయం సిండికేట్ సభ్యులుగా డాక్టర్ బీయూ సుమ, సోమశేఖర్ బణ్ణదమనె, డాక్టర్ ఎస్ఎం ముత్తయ్య, ఎన్ఏ మహ్మద్, ఇస్మాయిల్, డాక్టర్ బంజగెరె జయప్రకాశ్, డాక్టర్ ఫణిరాజ్, డాక్టర్ నటరాజ్ హుళియారు, బీఆర్ పాటిల్‌ను నియమించారు. బెంగళూరు నగర విశ్వవిద్యాలయానికి ఆయేషా ఫర్జానా, డాక్టర్ హెచ్. కృష్ణారాం, డాక్టర్ ఫ్రాన్సిస్ అస్సెస్సీ అలేదా, బి.శివకుమార్, కేపీ పాటిల్, డాక్టర్ బీరప్పను నియమించారు. బెంగళూరు విశ్వవిద్యాలయం (జ్ఞానభారతి క్యాంపస్) డాక్టర్ జయశ్రీ హెగ్డే, ఎంఏ మహదేవనాయక, డాక్టర్ కె.షరీఫ్, డీవీ గంగరాజు, దండగెరె నాగరాజు, రమేశ్ బాబు, బెంగళూరు ఉత్తర (కోలారు) యూనివర్సిటీకి సహన ఎస్ఆర్, జయదీప్, అర్బాజ్ పాషా, ఎం.గోపాలగౌడ, నిరూప్, కె.బసవరాజ్‌ను నియమించారు. కువెంపు యూనివర్సిటీకి ప్రొఫెసర్ సాకమ బి. శివకుమార్, ఎం.ముసావీర్ బాషా, లక్ష్మీకాంత్ చిమనూరు, కేపీసీ పాల్, హెచ్‌జీ అరవింద, గుల్బర్గా యూనివర్సిటీకి డాక్టర్ శ్రీదేవి ఎస్.కట్టిమనె, సిద్దప్ప సుళ్లద్, డాక్టర్ బిరాజద్ పహీముద్దీన్, మల్లణ్ణ ఎస్.మడివాళ్, ఉదయ్‌కాంత్ సిద్దప్ప మూలగె, రాయచూరు యూనివర్సిటీకి డాక్టర్ మీనాక్షి ఖండిమఠ, డీఆర్ చిన్న, జిషాన్, అఖిల్ సిద్దికి, శివణ్ణ చన్నబసవ, ప్రతిమాలను నామినేట్ చేశారు. విజయనగర కృష్ణదేవరాయ యూనివర్సిటీకి జయలక్ష్మినాయక్, డాక్టర్ అర్జోట్‌నాయక, బి.పీర్‌పాషా, శివకుమార్ కె, డాక్టర్ అమరేశ్ నిగడోని, చహా రఘునాథ్‌ను నియమించారు. జానపద యూనివర్సిటీకి డాక్టర్ జ్యోతిలక్ష్మి డి.పి, రామప్ప మానప్ప లంబాణి, సహనా పింజార, డాక్టర్ మూగళి గణేశ్, సంస్కృతి యూనివర్సిటీకి సిండికేట్ సభ్యులుగా డాక్టర్ బంగారమ్మ కె, డాక్టర్ శివలింగయ్య, డాక్టర్ మునీర్ అహ్మద్, బసప్ప, డొంకబళ్లి, హనుమంతనాథ, నారాయణ యాజిను నియమించారు.

బిడిదిలో భూముల కొరత

- టౌన్‌షిప్ నిర్మాణంపై కసరత్తు
- పదివేల ఎకరాలకు నోటిఫికేషన్
- భూముల సేకరణపై సందిగ్ధత
- రెడ్‌జోన్‌గా ప్రకటించడంతో పడిపోయిన ధరలు



టౌన్‌షిప్‌కు ప్రతిపాదించిన ప్రదేశం ఇదే

బెంగళూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు కూతవేటు దూరంలో ఉన్న బిడది ప్రాంతంలో భూముల కొరత ఏర్పడింది. గ్రేటర్ బెంగళూరు అభివృద్ధి ప్రాధికార ద్వారా టౌన్‌షిప్ నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందుకు పది వేల ఎకరాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. బెంగళూరు నగరం నలువైపులా అభివృద్ధి సాధిస్తోంది. తూర్పున ఎలక్ట్రానిక్‌సిటీ పరిధి దాటి దాదాపు రెండు దశాబ్దాలు అవుతోంది. అత్తిబెలె సరిహద్దుదాకా అభివృద్ధి చెందింది. త్వరలోనే బెంగళూరు - హోసూరు మధ్య మెట్రో రైలు నడిపే ప్రాజెక్టు వస్తుండడంతో ఈ ప్రాంతానికి గణనీయమైన డిమాండ్ వస్తోంది. మరోవైపు పడమర కెంగేరి దాకా మెట్రో సేవలు అందుబాటులోకి వచ్చాయి. అయినా మైసూరు రోడ్డులో ట్రాఫిక్ తీవ్రమవుతుండడంతో మెట్రోను మరింతదూరం విస్తరింపచేయాలనే ఆలోచన ఉంది. బృహత్ బెంగళూరు మహానగర పాలికె(బీబీఎంపీ)ని గ్రేటర్ బెంగళూరు అభివృద్ధి ప్రాధికారగా చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కసరత్తు చేస్తోంది. గ్రేటర్ బెంగళూరు అమలైతే బిడది, రామనగర జిల్లా అంతటా పరిధిలోకి చేరనుంది. రామనగరను బెంగళూరు దక్షిణ జిల్లా చేయాలని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పట్టుదలతో ఉన్నారు. గ్రేటర్ బెంగళూరు అభివృద్ధి ప్రాధికార 10వేల ఎకరాలలో టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇప్పటికే బిడది ప్రాంతం పర్యాటకంగాను ప్రాముఖ్యత సంతరించుకుంది. పరిశ్రమలతోపాటు అమ్యూజ్‌మెంట్ పార్క్ ఉంది. గ్రేటర్ బెంగళూరుతోపాటు అనుబంధమైన ఏ కార్పొరేషన్‌లోనూ కోట్లాది రూపాయలు గ్రాంట్లు ఖర్చు చేసే పరిస్థితి లేదు. 10వేల ఎకరాల టౌన్‌షిప్‌లో రాజకీయ సంఘర్షణే కాకుండా ఒక్కలిగ నాయకుల మధ్య మాటలతూటాలు పెరిగే అవకాశం ఉంది. ఎన్ని విమర్శలు వచ్చినా అభివృద్ధి చేసి తీరుతామని త్వరలోనే నోటిఫికేషన్ ఇస్తామని ఉపముఖ్యమంత్రి సవాల్ చేస్తున్నారు. 2007లో ముఖ్యమంత్రిగా ఉన్న కుమారస్వామి బిడది స్మార్ట్‌సిటీ పేరిట టౌన్‌షిప్ నిర్మించేందుకు 9 పల్లెలను కలుపుకొని 930 ఎకరాలను గుర్తించి నోటిఫై చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం పతనం కావడంతో ప్రాజెక్టు మరుగున పడింది. ఆ తర్వాత ఇక్కడి భూములను రెడ్‌జోన్‌గా ప్రకటించడంతో భూముల ధరలు పాతాళానికి పడిపోయాయి. విక్రయాలకు తంటాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. లైసెన్స్‌లు, ఎన్‌ఓసీలు, రుణాలు సాధ్యం కావు. నోటిఫై చేసిన భూముల చుట్టుపక్కల ఎకరం కోటి రూపాయలకు పైగా పలుకుతుండగా నోటిఫై భూములు రూ.30-40 లక్షలలోపుగానే ఉన్నాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం బిడది స్మార్ట్ సిటీ ప్రాధికారగా పేరు మార్చింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గ్రేటర్ బెంగళూరు అభివృద్ధి ప్రాధికార పేరిట 10వేల ఎకరాలకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇలా 15ఏళ్లక్రితంనాటి పరిస్థితి మరోసారి ఎదురయ్యేలా ఉంది. బిడదిలో భూముల ధరలు పడిపోయాయి. ఓసారి నోటిఫికేషన్ అయితే మరోసారి వాటిని డీ నోటిఫికేషన్ చేయడం సాధ్యం కాదు. ఇక రైతుల నుంచి నేరుగా ప్రభుత్వమే భూములు కొనుగోలు చేస్తుందా..? ఎంత ధర నిర్ణయించనుంది? భూమి యజమానులకు ల్యాండ్‌షేరింగ్ చేస్తే లాభనష్టాలు ఏమిటి..? అనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. రెడ్‌జోన్ అయ్యాక ప్రాజెక్టు నిలిచిపోతే భూముల ధరలు తగ్గిపోతాయి. వంశపారంపర్యంగాను లేదా అభివృద్ధి ఉంటుందని భూములు కొనుగోలు చేసినవారి పరిస్థితి అయోమయం కానుంది. ప్రాధికార అన్ని భూములకు ప్రాథమికంగా నోటిఫికేషన్ జారీ చేసి పెట్టుబడిదారులను ఆహ్వానిస్తుంది. 20 కుంటలకంటే తక్కువ భూమి కల్గిన రైతులకు పరిహారం ఇస్తారు. మిగిలిన రైతులతో ల్యాండ్‌షేరింగ్ చేసుకుంటారు. ఎవరినో నమ్మి నోటిఫికేషన్ విడుదల చేస్తే ఆ తర్వాత పెట్టుబడిదారులు ఆసక్తి చూపకపోతే ఏం చేయాలనే సందేహం నెలకొంది. ప్రాధికార రియల్‌ఎస్టేట్ చేసి సొమ్ము సంపాదించాలని ప్రయత్నాలు చేస్తున్నట్టు ఉంది. ఒకసారి ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ అయితే ఆ తర్వాత ముఖ్యమంత్రి మారినా డీ నోటిఫికేషన్ చేసేందుకు సాధ్యం కాదు. భూములు కోల్పోయేవారు నిర్ణయించినంత మేర పరిహారం తీసుకోవడం అనివార్యం కానుంది. అందుకే రైతులను ఒప్పించకుండా ప్రాజెక్టులు చేస్తే సహించేది లేదని జేడీఎస్ నేతలు సవాల్ విసురుతున్నారు. పది వేల ఎకరాల టౌన్‌షిప్ నిర్మాణం సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాల్సి ఉంటుంది. రైతులకు సమగ్రమైన సమాచారం ఇవ్వాలి. పెట్టుబడిదారులను ఆకర్షించాలి. ప్రభుత్వం ఏ ప్రాజెక్టులు చేస్తోంది, ఎన్ని ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోనుంది, ఎక్కడెక్కడ ప్రాజెక్టులు రానున్నాయి, పెట్టుబడిదారులు ఎవరు, వారి అనుభవం ఏమిటి, వారు ఏ విధమైన ప్రాజెక్టులు తీసుకురానున్నారనేది నిర్ణయించాల్సి ఉంటుంది. ప్రాజెక్టుకు ముందే మాస్టర్‌ప్లాన్ రూపకల్పన జరగాలి. రైతులు భూములు కావాలనుకుంటే ఉంచుకుంటారు, లేదా విక్రయించుకునేందుకు ముందుకొస్తారు. ప్రాధికారకు లే అవుట్ చేయకుండా అపార్ట్‌మెంట్లు నిర్మించలేదు. కేవలం ఉత్తరప్రత్యుత్తరాలు మాత్రమే చేయనుంది. ప్రాధికార ప్రారంభమై కేవలం 9 నెలలే అయ్యింది. అప్పుడే 10 వేల ఎకరాలతో టౌన్‌షిప్ చేసేందుకు వెళ్లడం అంత సులువు కాదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

రైతులతో చర్చించి ఒప్పిస్తాం

రైతులను ఒప్పించి వారితో చర్చలు జరిపి ప్రాజెక్టుకు శ్రీకారం చుడతాం. ప్రతిపక్షాలు దారితప్పేలా చేస్తున్నాయి. హడావిడిగా నోటిఫై చేయడం సాధ్యం కాదు. సోషల్ ఆడిట్ జరగాల్సి ఉంటుంది. ఆర్థికశాఖ అనుమతులు కేబినెట్ ద్వారానే జరగాలి. మాస్టర్‌ప్లాన్ చేసి రైతులకు వివరించాకే భూముల సేకరణ ప్రక్రియ చేస్తాం. భూముల నోటిఫికేషన్ చేసిన తర్వాతే ప్రాజెక్టు నిర్ణయం సాగిస్తాం.

- గాణకల్ నటరాజ్, గ్రేటర్ బెంగళూరు అధ్యక్షుడు



దేశీయ ఆవు నెయ్యి ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న సీఎం తదితరులు



తిరుమలకు బయలుదేరిన నందిని నెయ్యి ట్యాంకర్

తిరుమలకు మళ్లీ

నందిని నెయ్యి

బెంగళూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ప్రసాదం తయారీ కోసం కర్ణాటకకు చెందిన నందిని నెయ్యిని తరలించారు. ఏడాదిన్నర కాలంగా తిరుమలకు నందిని నెయ్యి సరఫరా నిలిచిపోయింది. టెండరు ధర తేడాతోపాటు అప్పటి టీటీడీ బోర్డు నిర్ణయాల కారణంగా 2022 నుంచి నెయ్యి సరఫరా నిలిపివేశారు. నందిని ఉత్పత్తుల నుంచి తిరుమలకు కొన్నేళ్లుగా ఆగ్‌మార్క్ స్పెషల్ గ్రేడ్ కల్గిన ఆవునెయ్యిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేవారు. 2013-14 నుంచి 2021-22వరకు 5వేల మెట్రిక్ టన్నుల నెయ్యిని తిరుమల ఆలయానికి సరఫరా చేశారు. ఆ తర్వాత నిలిపివేశారు. ప్రస్తుతం 2024-25 సంవత్సరానికిగాను తిరుమల ఆలయానికి 350 మెట్రిక్ టన్నుల నెయ్యి సరఫరా చేసేందుకు టెండరు ప్రక్రియ ముగిసింది. అందుకు అనుగుణంగానే ట్యాంకరు ద్వారా తిరుమలకు నెయ్యిని బుధవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్య పచ్చజెండా చూపారు. ఇదే సందర్భంగా మాగడి, కనకపుర, మరళవాడి, కోడిహళ్లి, మాడబాళ పరిధిలో 87 పాల ఉత్పత్తి సంఘాల నుంచి దేశీయ ఆవుల నుంచి పాలను సేకరించనున్నారు. శాహివాల్, గిర్, అమృత్‌మహల్, హళ్లికార్ జాతులకు చెందిన ఆవులను ప్రత్యేకంగా విభజించి దేశీయ ఆవుల నెయ్యిని తయారు చేస్తున్నట్టు కేఎంఎఫ్ ఛైర్మన్ భీమానాయక్ తెలిపారు. సదరు బ్రాండ్లను లాంఛనంగా విడుదల చేశారు. కార్యక్రమంలో ఎండీ జగదీశ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌తో డీసీఎం డీకే శివకుమార్ ముచ్చట్లు






విందు.. పసందు..!



బెంగళూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ తీరుపై కాంగ్రెస్ పెద్దలు ఒంటికాలిపై లేస్తున్నారు. ఆయన హోదాను కూడా లెక్కచేయకుండా ఇష్టారీతిన విమర్శలు గుప్పిస్తున్నారు. గవర్నర్ నిర్ణయాలను నిరసిస్తూ ఈనెల 31న 'చలో రాజ్‌భవన్'కు పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు.. అందరూ తరలిరావాలని తెలిపారు. ఇలా సాగుతున్న తరుణంలోనే.. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌తో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఓ విందులో పాల్గొని సరదాగా ముచ్చటించడం చర్చనీయాంశమయింది. బుధవారం బెంగళూరు నగరంలోని ఓ హోటల్‌లో మంత్రి బైరతి సురేశ్ కుమారుడు సంజయ్‌తో యలహంక బీజేపీ ఎమ్మెల్యే విశ్వనాథ్ కుమార్తె అపూర్వకు నిశ్చితార్థం జరిగింది. కార్యక్రమానికి హాజరైన గవర్నర్, డీసీఎం కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కాసేపు ముచ్చటించుకున్నారు. పలువురు మంత్రులతోపాటు కాంగ్రెస్, బీజేపీ ముఖ్యనాయకులంతా పాల్గొన్నారు. కాగా, సీఎం సిద్దరామయ్యతోపాటు పలువురు మంత్రులు ఆలస్యంగా హాజరయ్యారు.

తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు



	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1628.56	1,625.79
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	21,678	220
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,107	6,723
సామర్థ్యం (టీఎంసీలు)	88.76	79.70

పొద్దుతిరుగుడు ఉత్పత్తులను కొంటాం

● కలెక్టర్ ప్రశాంత్ కుమార్



బళ్లారి సిటీ, ఆగస్టు 28: మద్దతు ధర పథకం కింద పొద్దుతిరుగుడు విత్తనాలను వర్షాకాలంలోనే కొనుగోలు చేస్తామని జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ చైర్మన్ జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. జిల్లాలో కర్ణాటక సహకార నూనెగింజల ఉత్పత్తిదారుల మహా మండలి ద్వారా నాణ్యమైన పొద్దుతిరుగుడు ఉత్పత్తులను క్వింటాల్‌కు రూ.7,280 వంతున రైతుల నుంచి కొనుగోలు చేస్తామన్నారు. పొద్దుతిరుగుడు ఉత్పత్తిని 90రోజుల పాటు కొనుగోలు చేస్తారన్నారు. ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ప్రభుత్వ సెలవులు మినహా మిగిలిన రోజుల్లో కొనుగోళ్లు జరుగుతాయన్నారు. సామాజిక దూరం, పరిశుభ్రత, వైరస్ వ్యాప్తిని అరికట్టడం గురించి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన సూచనలను పాటించడం తప్పనిసరన్నారు.

పురోహితులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసులు

సిరుగుప్ప, ఆగస్టు 28 : అసంఘటిత పురోహితులకు ఆలయాల్లో సేవలు చేయడానికి గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలని రాష్ట్ర పురోహితుల సంఘం అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న పురోహిత కార్మికులకు వివిధ ఆలయాల్లో సేవలు చేయడానికి అవకాశం కల్పించాలని కోరారు. అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన దేవాదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. అందుకు రామలింగారెడ్డి స్పందిస్తూ అందరికీ గుర్తింపు కార్డులను ఇచ్చే ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పంటల సమీక్షకు సహకరించాలి




మాట్లాడుతున్న తహసీల్దార్ విశ్వనాథ్

సిరుగుప్ప, ఆగస్టు 28 : పంటల సమీక్షకు రైతులు సహకరించాలని తహసీల్దార్ విశ్వనాథ్ కోరారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పంటల సమీక్ష నిర్వహించడంపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పత్తి, మిరప, జొన్నలు, సజ్జలతోపాటు వరిపంటపై సమీక్ష చేయడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్క రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పాటిల్, అసిస్టెంట్ అధికారి దర్శప్ప, రైతులు పాల్గొన్నారు.

రోడ్లపై ట్రాక్టర్లకు దమ్ము చక్రాలు వద్దు

కంప్లి, ఆగస్టు 28 : రైతన్నలు తమ పొలాల్లో సేద్యం చేసుకునే ట్రాక్టర్లకు ఇనుప దమ్ము చక్రాలను రోడ్లపైన వాడరాదని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ విజ్ఞప్తిచేశారు. కంప్లి తాలుకా పరిధిలోని దేవసముద్రం, మెట్రి, దేవలాపురం, జవుకు, జానూరు ఇతర గ్రామాల రైతన్నలు ట్రాక్టర్లను ఇనుప చక్రాలతో పొలం వరకు వేసుకుని వెళుతున్నారని, అలా చేయడం వల్ల రోడ్లు పూర్తిగా ధ్వంసమవుతున్నాయన్నారు. కొన్ని సంవత్సరాలుగా రోడ్లు అభివృద్ధి లేక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఇలా నూతన రోడ్లపై ఇనుప చక్రాలతో వెళితే గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. ఇనుప చక్రాలు వాడితే జరిమానా విధిస్తామన్నారు. గ్రామాల్లో వేసిన నూతన రోడ్లను గ్రామీణులు తామే కాపాడుకోవాలన్నారు.

ప్రకృతి ఒడిలో కొలువుదీరిన కుమారస్వామి



ఘాట్‌రోడ్డు, నందినోట్లో నుంచి వస్తున్న నీరు



ప్రత్యేకాలంకరణలో సండూరు కుమారస్వామి



కనువిందు చేసే ఆలయ ప్రాంగణం

శక్తిహస్తం విరూపాక్షం శిఖివాహం షడాననం
దారుణం రిపురోగఘ్నం భావయేత్ కుక్కుటధ్వజం

అని ప్రార్థిస్తూ భక్తులు తండోపతండాలుగా సండూరు కుమారస్వామి దర్శనానికి వస్తుంటారు. పచ్చనికొండల మధ్యన బళ్లారిజిల్లా సండూరు తాలుకాలో వెలసిన ఈ కుమారస్వామి క్షేత్రం పర్యాటకులను విపరీతంగా ఆకర్షిస్తోంది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో భక్తులు షణ్ముఖుడిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో వస్తుంటారు. స్వామి దర్శనం కోసం వెళ్లినవారు ముందస్తుగా హరిశంకర దర్శనం చేసుకుని అనంతరం కుమారస్వామి దర్శనం చేసుకుంటారు. సమీపంలోని తారానగర్ డ్యామ్ మరింత ఆకర్షణీయంగా ఉంటుంది.

కుమారస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

శ్రావణమాసం మూడో మంగళవారం సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడానికి ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలతో పాటు కర్ణాటక బళ్లారి, హోస్పేట, రాయచూరు, కొప్పాళ్ జిల్లాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. దర్శనం చేసుకున్న భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేపట్టినట్లు ఆలయ కమిటీ అధికారులు తెలిపారు.

-బళ్లారిరూరల్

'దర్శనం' కోసం నిరీక్షణం



బళ్లారి కారాగారం వద్ద పోలీసు భద్రత



దర్శన్ కోసం వేచివున్న అభిమానులు

బళ్లారి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రేణుకాస్వామి హత్యకేసులో నిందితుడు, కన్నడ సినిమా హీరో దర్శన్‌ను బెంగళూరులోని పరప్పన హళ్లి జైలు నుంచి బళ్లారి జైలుకు తరలిస్తున్నారనే సమాచారంతో బళ్లారి పోలీసులు జైలు వద్ద భద్రత పెంచారు. అలాగే తమ అభిమాన హీరో ను చూసేందుకు అభిమానులు జైలు వద్దకు చేరుకుని ఎదురు చూస్తున్నారు. జైల్లో దర్శన్‌ను ఉంచేందుకు ప్రత్యేక బ్యారక్‌ను సిద్ధం చేశారు. కాగా బళ్లారి ఎస్పీ శోభారాణి బుధవారం సాయంత్రం జైలువద్దకు వచ్చి దర్శన్ రాకపై తమకు సమాచారం ఏమీ లేదని అక్కడ నుంచి అందరినీ పంపివేశారు.

తెలుగు భాషోద్యమంలో 'ధర్మవరం' కృషి మరువలేనిది

● నేడు బళ్లారిలో తెలుగు భాషా దినోత్సవం

బళ్లారి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యానికి పూర్వం, అతర్వాత మద్రాస్ ప్రావిన్స్‌లో తెలుగు భాషోద్యమానికి బళ్లారికి చెందిన కవులు, పండితులు, ఎనలేని కృషి చేశారని ధర్మవరం నరసింహ జయంత్ కొనియాడారు. బళ్లారి రాఘవకళామందిరంలో గురువారం తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా రామకృష్ణమాచార్యుల వంశస్థులయిన ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆనాటి తెలుగుభాషా ఉద్యమాన్ని బళ్లారి కేంద్రంగా ఆంధ్ర నాటక కవితా పితామహ ధర్మవరం రామకృష్ణమాచార్యులు ముందుండి నడిపించారన్నారు. తెలుగు మాట్లాడే ప్రాంతాల్లో తెలుగు భాషా సంఘాలు అనేకం నెలకొల్పి ప్రజలను భాగస్వాములను చేశారని గుర్తు చేశారు.

బళ్లారి నగరంలో తొలినాళ్లలోనే వీరసంఘం డిబేటింగ్ సొసైటీ, సరస వినో దిని సభ ప్రారంభించి తెలుగు మాట్లాడే వారందరిని ఒకేచోట చేర్చి చర్చలు చేయించారన్నారు. అతర్వాత ఆచార్యులు మద్రాసు కేంద్రంగా ఆంధ్ర కవి పండిత సంఘం ఏర్పాటు చేసి బహుళ ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారన్నారు. ఈ సభలన్నింటితో తెలుగు భాషా వికాసం, అభివృద్ధి కోసం తన వంతు సహకారాన్ని అందించారని తెలిపారు. సభల్లో తెలుగు భాషాభిమానులు, కవులు, పండితులను సన్మానించేవారన్నారు. సంస్కృత భాష మీద ఆధారపడకుండా కొత్తగా తెలుగు వ్యాకరణాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ప్రతి కవి తెలుగులో స్వతంత్ర నాటకాలు రాయడం, టెక్నికల్ రాతలో తెలుగు భాషను వృద్ధి చేయడం, తెలుగు భాషా వికాసానికి విరాళాలు సేకరించడం, సాహిత్య విమర్శలు లాంటి అనేక పార్శ్వాంశాల్లో తెలుగు భాషను ప్రజల మధ్యకు తీసుకుపోయిన మహనీయుడు ధర్మవరం రామకృష్ణమాచార్యులు అని కొనియాడారు. ఆయన ఆంధ్ర కర్ణాటక మద్రాస్ రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటించి తెలుగు భాషా వికాసానికి దోహదపడ్డారని తెలిపారు. ఆచార్యులు తెలుగు భాషా సేవలను గుర్తించిన గద్వాల మహారాజు ఆయనకు ఆంధ్ర నాటక కవితా పితామహ అనే బిరుదును ఇచ్చారని తెలిపారు. రామకృష్ణామాచార్యులు పరమపదించడంతో ఆంధ్ర కవిపండితసంఘం ఆశయాలు, కుంటుపడ్డాయన్నారు.

దేశ నిర్మాణానికే యువజనోత్సవాలు

● ఎన్ఎస్ఎస్ అధికారి ప్రతాప్ లింగయ్య



ఊరేగింపులో డప్పుకొడుతున్న రుద్రేశ్, తాళం వేస్తున్న మునిరాజ్

బళ్లారి సిటీ, ఆగస్టు 28: యువజనోత్సవాలు బలమైన దేశ నిర్మాణానికి దోహదపడతాయని రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి ప్రతాప్ లింగయ్య అన్నారు. యువజన సాధికారత, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం రాష్ట్రస్థాయి యువజనోత్సవం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఐదు రోజులపాటు జరిగే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమన్నారు. రెండూ ఉంటేనే సామాజిక ఆరోగ్యం బాగుంటుందన్నారు. రాష్ట్రంలో ఎన్ఎస్ఎస్ ద్వారా ఆరున్నర లక్షల మంది విద్యార్థులు సేవలందిస్తున్నారని, ఇలాంటి శిబిరాల్లో పాల్గొంటే భిన్నమైన సంస్కృతిని నేర్చుకోవడమే కాకుండా అసూయ, అహంకారం, అసమానత, వివక్ష దూరమవుతాయన్నారు. విశ్వవిద్యాలయ కులపతి ప్రొఫెసర్ మునిరాజ్ మాట్లాడుతూ నేటి యువతకు ఎన్ఎస్ఎస్, యోగా అవసరమన్నారు. దీని ద్వారా విద్యార్థుల మానసిక స్థైర్యం మెరుగుపడుతుందన్నారు. తద్వారా యూనివర్శిటీలో వచ్చే ఏడాది బీపీఈడీ కోర్సును ప్రాంభించనున్నట్లు తెలిపారు. సండూరులోని నందిహళ్లి పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్‌లో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభించే యోచన ఉందన్నారు. దీని ద్వారా విశ్వవిద్యాలయాన్ని క్రీడా విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఐదు రోజులపాటు జరిగే ఈ యువజనోత్సవాలకు రాష్ట్రంలోని 21యూనివర్శిటీల నుంచి 200మంది పైగా విద్యార్థులు తరలివచ్చారు. పెయింటింగ్, సంగీతం, నృత్యం, గానం, ఎగ్జిబిషన్, తదితర పోటీల్లో పాల్గొని తమప్రతిభను చాటుకుంటారు. కార్యక్రమ ప్రారంభానికి ముందు జరిగిన జాన పద కళాబృందాల సాంస్కృతిక ఊరేగింపులో రుద్రేశ్ డప్పు వాయించారు. కులపతి మునిరాజ్ తాళాలు కొట్టి విద్యార్థులను ఉత్సాహపరిచారు.

గ్రామాభివృద్ధికి ఐక్యతతో ముందుకు రావాలి



బలాపురంలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, ఆగస్టు 28: గ్రామాల్లో జరిగే అభివృద్ధిపనులకు గ్రామస్థులందరూ ఐక్యతతో ముందుకు రావాలని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. బుధవారం ఎస్ ఆర్‌పురం, బలాపురం గ్రామంలో కేకేఆర్‌డీపీ నిధుల కింద సీసీ రోడ్లు, మురుగు కాలువలకు భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ హయాంలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చుతున్నామన్నారు. బీజేపీవారు తమ నాయకుడు సిద్దరామయ్యపై లేనిపోని కుతంత్రాలు చేస్తున్నారన్నారు. ఎన్నటికీ నిజాయితీనే గెలుస్తుందన్నారు. 134 మంది ఎమ్మెల్యేలు సిద్దరామయ్యకు మద్దతుగానే వున్నారని తెలిపారు. తుంగభద్ర జలాశయంలో 19వ గేటు తెగిన సందర్భంలో తాము ఐదు రోజుల పాటు అక్కడే వుంటూ పనులు త్వరగా ముగించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే 80 టీఎంసీలకు పైగా నీరుందని, పై భాగాల్లో కూడా వర్షాలు పుష్కలంగా కురుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో లింగప్ప, కరియప్ప, మౌనేష్, ఓంకారప్ప, బంగి మల్లయ్య, వన్నూరు, అంబన్న, నాగప్ప, జడెప్ప పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటా: ఎంపీ తుకారాం



నిరసన కార్యక్రమంలో ప్రముఖులతో మాట్లాడుతున్న ఎంపీ తుకారాం

కంప్లి, ఆగస్టు 28 : కుడితిని పరిధిలో బ్రాహ్మణి, ఎన్ఎండీసీ, లక్ష్మీమిట్టల్ తదితర కర్మాగారాల ఏర్పాటు కోసం భూములు పోగొట్టుకున్న రైతన్నలకు అండగా వుంటానని ఎంపీ ఈ తుకారామ్ తెలిపారు. ఆయన సండూరు నుంచి బళ్లారికి వెళ్లే సమయంలో కుడితినిలో నిరసన చేపట్టిన రైతుల వద్దకు వెళ్లి చర్చించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, వర్షం, ఎండలను లెక్కచేయకుండా నిరసనలు చేపడుతున్నా ఇంతవరకు రైతులకు న్యాయం చేకూర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్గాంలో శీతాకాల సమావేశాల సమావేశ సమయంలో తమ నాయకులు సిద్దరామయ్యను కూడా కలిశారని, ఆయన కూడా సర్వే చేపట్టి భూములు పోగొట్టుకున్న వారికి న్యాయం చేయాలని సూచించారన్నారు. దీనిపై ఎంపీ మాట్లాడుతూ బ్రాహ్మణి, లక్ష్మీ మిట్టల్, ఎన్ఎండీసీ కంపెనీలతో చర్చలు జరుపుతున్నామన్నారు. త్వరలోనే తమ నాయకుడితో చర్చలు జరిపి న్యాయం జరిగేలా చేస్తామని తెలిపారు. వారితో పాటు చంద్రప్ప, వి రాజశేఖర్, అంజి, కనికేరి పంపాపతి, దొడ్డప్ప, రైతు సంఘం రక్షణ వేదిక రైతులు, మహిళలు తదితరులు కూడా పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలి



ఎమ్మిగనూరులో రోడ్డుపై నిర్వహిస్తున్న వారపు సంత

కంప్లి, ఆగస్టు 28: ఎమ్మిగనూరు గ్రామంలో వారపు సంత కోసం షెడ్లు ఏర్పాటు చేయాలని వ్యాపారస్తులు కోరారు. కంప్లి తాలుకా పరిధిలోని ఎమ్మిగనూరు గ్రామంలో వారపు సంత జరుగుతుంది. అక్కడ ఎలాంటి మార్కెట్ షెడ్లు లేకపోవడంతో ఆరుబయట రోడ్లపైనే కాయగూరలను రాశులుగా పోసుకుని అమ్మకం జరుపుతున్నారు. వారానికి ఒక రోజు డబ్బు వసూలు చేస్తున్నారు. కానీ దానికి తగ్గట్లు సౌకర్యాలు లేకుండా పోతున్నాయన్నారు. బుధవారం అమ్మకాలు జరుగుతున్న సమయంలో వర్షం రావడంతో ప్రజలు పరుగులు తీశారు. అక్కడున్న వ్యాపారులు మాత్రం కాయగూరలు తడవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. యేటా వర్షాకాలంలో తమకు ఇదే పరిస్థితి అని వ్యాపారస్తులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, గ్రామ పంచాయతీ సభ్యులు దృష్టి సారించి వారపు సంతకు షెడ్లు ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు.

హోసూరు జోన్

లైంగిక వేధింపుల నియంత్రణకు కమిటీలు



సమావేశంలో చర్చిస్తున్న వివిధశాఖల అధికారులు

హోసూరు(కృష్ణగిరి) ఆగస్టు 28: విద్యార్థులు పర్యటనలకు పోయే స్థలాల్లోగానీ, పాఠశాలల్లో గానీ అమలు చేస్తున్న భద్రతా ప్రమాణాలను నిర్ధారించేందుకు బుధవారం కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సాంఘీక సంక్షేమ మహిళా హక్కుల శాఖ కార్యదర్శి జయశ్రీ మురళీధరన్ పోలీస్ చీఫ్ భువనేశ్వరి పాల్గొనగా, సెక్యూరిటీ కమీషనర్ జానీ టామ్ వర్గీస్ అధ్యక్షత వహించారు. జిల్లా కలెక్టర్ సమక్షంలో ఈ సమావేశం జరిగింది. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలో శిక్షణా శిబిరంలో కొంతమంది విద్యార్థినులు లైంగిక వేధింపులకు గురికావడంపై విచారణ జరిపి, నిందితులపై తగిన చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేశారు. వారి సంక్షేమం, పునరావాసం కోసం బహుళ ప్రయోజన కమిటీని ఏర్పాటు చేశారు. బాధిత పిల్లల వలన వారి తల్లి తండ్రులకు ఎలాంటి ఇబ్బందులు కూడా కలగకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. అలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే పాఠశాల విద్యా శాఖ ఆర్డినెన్స్ రూల్స్ నెంబర్ 83లో పేర్కొన్న విధంగా పాఠశాలల్లో అమలు చేస్తున్న భద్రతా ప్రమాణాలను నిర్ధారించేందుకు కమిటీని ఏర్పాటు చేసి సంప్రదింపులు జరిపారు. ఈ సర్వేల్లో చైల్డ్ వెల్ఫేర్ అండ్ స్పెషల్ సర్వీసెస్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, సైకియాట్రిస్ట్ , మెంటల్ హెల్త్ కన్సల్టెంట్ చైల్డ్ ప్రొటెక్షన్ యాక్టివిస్ట్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పోలీసు విధులపై శిక్షణ

హోసూరు, ఆగస్టు 28: హోసూరు టౌన్ పోలీస్ స్టేషన్‌లో పాఠశాల విద్యార్థులకు పోలీసు విధుల గురించి అవగాహన కల్పించారు. ముందుగా టౌన్ పోలీస్ స్టేషన్‌కు ప్రైవేట్ పాఠశాల పిల్లలను తీసుకొచ్చి వారికి పోలీస్‌స్టేషన్ పై అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ పిల్లలకు అర్థమయ్యే విధంగా మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించే సమయంల్లో ఎడమవైపే ప్రయాణించాలని తెలిపారు. 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న ఎవరైనా సరే వాహనం నడపకూడదని, కారు వంటి వాహనాల్లో ప్రయాణించేటప్పుడు సీటు బెల్ట్ ధరించాలని తెలిపారు. చిన్నపిల్లలతో పాఠశాలకు వెళ్లేటపుడు తల్లి తండ్రులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. స్నేహితులను వెంట బెట్టుకుని హెల్మెట్లు ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడపకూడదన్నారు. ఇప్పుడిప్పుడే పెరుగుతున్న పిల్లలకు ఇలా చెప్పడంతో వారికి ఎప్పటికి గుండెల్లో నాటుకుంటుందని తెలిపారు.

మళ్లీ రూ.30 పలుకుతున్న కొత్తిమీర

హోసూరు(సిఫ్‌కాట్) ఆగస్టు 28 : హోసూరు, రాయకోట, శూలగిరి, ఉద్దన్నపల్లి, తళి, అంచెట్టి, తదితర ప్రాంతాల్లో అనేక ఎకరాల్లో కొత్తిమీర సాగు చేస్తున్నారు. గత వారం రోజులుగా మార్కెట్లులో సరైన ధరలు లభించక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కోతకు వచ్చిన పంటను కూడా అలాగే వదలి పెట్టి, ధరల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ధరలు పెరగడంతో కొత్తిమీర కట్ట మళ్లీ రూ. 30లకు విక్రయించడం మొదలు పెట్టారు.



తోటలో ఏపుగా పెరిగిన కొత్తిమీర పంట

నగరసభ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవం

రాయచూరు, ఆగస్టు 28 : ఏడాది పాటు ప్రత్యేక అధికారి పాలనలో సాగిన నగరసభకు బుధవారం నిర్వహించిన అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. ఎస్సీ మహిళ కేటగిరీకి రిజర్వు అయిన అధ్యక్ష స్థానం కోసం 21వ వార్డు సభ్యురాలైన నరసమ్మ నామినేషన్ వేయగా బీసీ ఏ క్యాటగిరికి రిజర్వ్ అయిన ఉపాధ్యక్ష స్థానం కోసం 16వ వార్డు సభ్యుడు సాజీద్ సమీర్ నామినేషన్ వేశారు. నిర్ణీత గడువులోగా మరే ఇతర నామినేషన్లు దాఖలు కాకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన సహాయ కమిషనర్ మహెబూబి ప్రకటించారు. కాగా నగరసభ అధికారం మరో సారి కాంగ్రెస్ పరం కావడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. ఎన్నికకు పూర్వం మంత్రి ఎన్.ఎస్.భోసరాజు కాంగ్రెస్ స్వతంత్ర్య అభ్యర్థులందరితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి నగరసభ అధికారాన్ని కాంగ్రెస్ దక్కించుకునేలా వారితో చర్చలు జరిపారు. స్వతంత్ర్య సభ్యులందరు కాంగ్రెస్‌కు అండగా నిలవడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. తగినంత సంఖ్యాబలం లేక పోవడంతో ఎన్నికకు బీజేపీ దూరంగా ఉండిపోయింది.



అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న ఏసీ



శీలహళ్ళి వంతెనపై ప్రవహిస్తున్న వరదనీరు

మునిగిన శీలహళ్ళి వంతెన

రాయచూరు, ఆగస్టు 28: జిల్లాలోని లింగసుగూరు తాలూకాలో కృష్ణానదిపై ఉన్న శీలహళ్ళి వంతెన బుధవారం వరద నీటిలో మునిగింది. దీంతో తాలూకాలోని నడిగడ్డ హంచినాళ, యళగుంది, యరగోడి, కడదరగడ్డి గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి లింగసుగూరు నుంచి 45 కి.మీ చుట్టు తిరిగి రావాల్సిన పరిస్థితి తలెత్తింది. కృష్ణానది ఎగువ భాగంలో కురుస్తున్న వర్షాలతో నారాయణపూర్ బసవసాగర జలాశయంలో ఇన్‌ఫ్లో 1.40 లక్షల క్యూసెక్కులకు పెరగడంతో అధికారులు 30 గేట్లను ఎత్తి 1.80 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో జిల్లా సరిహద్దులోని తీరగ్రామాల ప్రజలు మరో సారి అభద్రలో మునిగిపోయారు. ఇప్పటికే ఆయా గ్రామాల ప్రజలను హెచ్చరించిన అధికారులు ప్రవాహం తగ్గే వరకు నది తీరానికి వెళ్లవద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంస్...

గిడుగు వెంకట రామమూర్తి (జయంతి)



ఆంధ్రదేశంలో వ్యవహారిక భాష ఉద్యమానికి మూల పురుషుడు గిడుగు వెంకట రామమూర్తి 1863 ఆగస్టు 29న శ్రీకాకుళం ప్రాంతం పర్వతాలపేట గ్రామంలో జన్మించారు. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని వాడుకభాషలోకి తీసుకొచ్చి భాష అందాన్ని తెలియజేసిన మహనీయుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘ సంస్కర్త, హేతువాది. కైజర్ ఎ హింద్, రావు సాహెబ్ బిరుదులు పొందారు. కళాప్రపూర్ణ పురస్కార గ్రహీత. ఆయన జయంతిని 'తెలుగు భాషా దినోత్సవం'గా ఆచరిస్తున్నారు. 1940 జనవరి 22న కన్నుమూశారు.

ధ్యాన్‌చంద్ (జయంతి)



హాకీ మాంత్రికుడిగా పేరొందిన ధ్యాన్‌చంద్ 1905 ఆగస్టు 29న అలహాబాద్‌లో జన్మించారు. దేశంలో హాకీ క్రీడకు గుర్తింపు తెచ్చారు. ఒలింపిక్స్‌లో మూడు బంగారు పతకాలు సాధించారు. 1928-64 మధ్య 8 ఒలింపిక్స్ క్రీడలలో 7సార్లు గెలుపొందడంలో ఆయన కీలకులు. ఆర్మీలో మేజర్‌గా కొనసాగుతూనే క్రీడలకు వన్నె తెచ్చిన ఆయనకు 'పద్మభూషణ్' పురస్కారం అందుకున్నారు. 1979 డిసెంబరు 3న కన్నుమూశారు. ఆయన జయంతిని 'జాతీయ క్రీడా దినోత్సవం'గా ఆచరిస్తూ క్రీడలలో రాణించినవారికి 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న' అవార్డుతో గౌరవిస్తున్నారు.

ఇంద్రగంటి హనుమత్‌శాస్త్రి (జయంతి)



సాహితీవేత్తగా పేరొందిన ఇంద్రగంటి హనుమత్‌శాస్త్రి (హనుమచ్ఛాస్త్రి) 1911 ఆగస్టు 29న విశాఖపట్నం జిల్లా వీరవల్లి తాలూకా వడ్డాదిమాడుగుల గ్రామంలో జన్మించారు. గేయ రచయిత, కవిగా రాణించడమేకాక పలు రేడియో నాటికలను అందించారు. సంస్కృతాంధ్ర ఉపన్యాసకులుగా పనిచేశారు. ఆయన రాసిన కథలలో 'ఆరు నెంబరు గది' పేరొందింది. వ్యాసావళి, కాళిదాస కళామందిరము పేరొందాయి. 'ఆరుయుగాల ఆంధ్ర కవిత' ప్రత్యేక రచన ఆకటుకుంది. 1987 నవంబరు 14న పరమపదించారు.

రామకృష్ణ హెగ్డే (జయంతి)



జనతాపార్టీ నాయకుడిగా రాజకీయాలలో ఎంతోమందికి మార్గ దర్శకత్వం వహించిన రామకృష్ణ హెగ్డే ఉత్తరకన్నడ జిల్లా సిద్దాపురలో 1926 ఆగస్టు 29న జన్మించారు. 1983 నుంచి 1988 వరకు కర్ణాటక ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. కేంద్ర మంత్రిగాను, ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్‌గా కొనసాగారు. 'రాష్ట్రీయ నవ నిర్మాణ వేదిక' స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశారు. అంతేకాక మరణ మృదంగ, ప్రజాశక్తి వంటి సినిమాలతోపాటు కొన్ని నాటకాల్లో నటించారు. 2004 జనవరి 12న కన్నుమూశారు.

ద్వారం మంగతాయారు (జయంతి)



ప్రముఖ వయోలిన్ విద్వాం సురాలు ద్వారం మంగతాయారు 1937 ఆగస్టు 29న విజయ నగరంలో జన్మించారు. తండ్రి ద్వారం వెంకటస్వామి నాయుడు వద్ద వయోలిన్‌లో శిక్షణ పొంది రాణించారు. చెన్నై ఆలిండియా రేడియోలో ఏ గ్రేడ్ కళా కారిణిగా సుదీర్ఘకాలం సేవలందించారు. ఎంఎస్ సుబ్బలక్ష్మి, డి.కె.పట్టమ్మాళ్, వేదవల్లి వంటి ప్రముఖల కచేరీ లకు సహకారం అందించారు. సంగీత కళానిధి, నాద జ్యోతి, టిటిడి అవార్డు, కళారత్న పురస్కారం ఇతర అవార్డులు అందుకున్నారు. 2022లో కన్నుమూశారు.

ఇన్‌గ్రిడ్ బెర్గ్‌మన్ (జయంతి, వర్ధంతి)



క్లాజిక్ హాలీవుడ్ సినిమాలో నాల్గవ గొప్ప మహిళగా పేరొందిన ఇన్‌గ్రిడ్ బెర్గ్‌మన్ 1915 ఆగస్టు 29న స్వీడన్ దేశంలో జన్మించారు. నాటకాలతోపాటు బుల్లి తెర పైనా రాణించారు. యూరప్‌తోపాటు హాలీవుడ్‌లోనూ పేరొందారు. 3 అకాడమీ అవార్డులు, 3 గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్, టోనీ అవార్డ్ అందుకున్నారు. 1982 ఆగస్టు 29న కన్నుమూశారు. ఇలా జయంతి, వర్ధంతి ఒకే రోజున రావడం గమనార్హం.

మైఖేల్ జాక్సన్ (జయంతి)




డ్యాన్సర్‌కు మారుపేరుగా నిలిచిన అమెరికాకు చెందిన మైఖేల్‌జాక్సన్ 1958 ఆగస్టు 29న జన్మించారు. అమెరికన్ గేయ రచయితగా, గాయకుడిగాను రాణించారు. 'కింగ్ ఆఫ్ పాప్' అనువాదంతో పాప్ సింగర్‌గా పేరొందారు. ప్రపంచవ్యాప్తంగా ఆయన ఆల్బమ్స్ లక్షల సంఖ్యలో అమ్ముడయ్యాయి. 13 గ్రామీ అవార్డులు, 39 గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌తోపాటు ఎన్నో పురస్కారాలు పొందారు. 2009 జూన్ 25న కన్నుమూశారు.

డాక్టర్ కె.రాధాకృష్ణన్ (పుట్టినరోజు)



అంతరిక్ష పరిశోధక శాస్త్రవేత్త డాక్టర్ కె.రాధాకృష్ణన్ 1949 ఆగస్టు 29న జన్మించారు. 2009-14వరకు 'ఇస్రో' అధ్యక్షుడిగా వ్యవహరించారు. చంద్రయాన్-1 విజయ వంతం అయ్యేందుకు కృషి చేశారు. ఇస్రో 37 స్పేస్ మిషన్‌లు సాధించడంలో ఆయన ఎంతో కీలకంగా వ్యవహరించారు. అందులో మంగళయాన్ ప్రయోగం ఒకటి. 'పద్మభూషణ్' గ్రహీత. కర్ణాటక సంగీతం, కథాకళి కళాకారుడు. ఐఐటి ఖరగ్‌పూర్ సహా 12 యూనివర్శిటీలచే గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు.

అక్కినేని నాగార్జున (పుట్టినరోజు)



దక్షిణాది ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున 1959 ఆగస్టు 29న మద్రాస్‌లో జన్మించారు. తండ్రి నాగేశ్వరరావు బాటలో ఆయన కూడా సినీరంగంలో సాగారు. నిర్మాతగా, బుల్లితెర వ్యాఖ్యాతగాను రాణించారు. తెలుగులో వందకుపైగా సినిమాలలో నటించారు. 9 నంది అవార్డులు, 3 ఫిల్మ్‌అవార్డ్స్ సౌత్, జాతీయ స్థాయిలో పురస్కారం అందుకున్నారు.

నైపుణ్య పెంపుకోసం కేంబ్రిడ్జ్ ఇంజనీరింగ్ కళాశాల ఒప్పందం

బెంగళూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కేఆర్ పురంలోని కేంబ్రిడ్జ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల నైపుణ్య శిక్షణలు పెంపొందించేందుకై బీటా సీఏఈ సిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. కేంబ్రిడ్జ్ గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ డి.కె మోహన్, బీటా సంస్థ సీఈఓ స్టారోజ్ క్లిడా రియాజ్‌ల మధ్య ఒప్పందం కుదిరింది. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. కేంబ్రిడ్జ్ సంస్థల సీఈఓ నితిన్ మోహన్, బీటా మార్కెటింగ్ హెడ్ లోకేశ్ ఎస్ బొమ్మని, కళాశాల ప్రిన్సిపాల్ జి ఇందుమతి, అకడమిక్ అడ్వైజర్ కెఎన్ బాలసుబ్రమణ్యమూర్తిలు పాల్గొన్నారు. ఒప్పందం ద్వారా పరస్పర సహకారం విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యశిక్షణలకు అనుకూలం కానుందని పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను సమకూర్చుకునేందుకు అనుకూలం కానుందని డి.కె. మోహన్ వెల్లడించారు.



ఒప్పందంలో ఇరు సంస్థల ప్రముఖులు

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో రాణించాలి

దొమ్మసంద్ర, ఆగస్టు 28: విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణ, నైతిక విలువలతో రాణించాలని సర్దార్ వల్లభాయ్‌పటేల్ విద్యాసంస్థ డైరెక్టర్ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. 2024-25 వార్షిక ప్రథమ సెమిస్టర్ విద్యార్థులకు స్వాగతం, ప్రతిభావంత విద్యార్థులకు ప్రోత్సాహకాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలను అర్థం చేసుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు హితవు పలికారు. సంస్థ కార్యదర్శి వీరప్పరెడ్డి మాట్లాడుతూ 80వ దశకంలో ఈ ప్రాంతంలో ఎస్ఎస్ఎల్‌సిన పీయూసీ చదివిన తర్వాత డిగ్రీ కోసం బెంగళూరు నగరానికి వెళ్లడం సమస్యగా ఉండేదన్నారు. 1988లో బాలికలకోసం కళాశాల ఏర్పాటు చేశారన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో 30మంది పేద ప్రతిభావంత విద్యార్థులకు తలా రూ.5వేల ప్రోత్సాహక చెక్కులను అందచేశారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పూర్వ విద్యార్థుల సంఘం పదాధికారులు రఘునాథ రెడ్డి, వివేకానంద తదితరులు పాల్గొన్నారు.



తరగతులను ప్రారంభిస్తున్న ప్రముఖులు

31న ఉద్యోగమేళా

మహదేవపుర, ఆగస్టు 28: కేఆర్‌పురంలోని సిలికాన్ సిటీ కళాశాలలో ఈనెల 31న శనివారం ఉదయం 9 గంటలకు ఉద్యోగమేళా జరగనుందని కళాశాల ముఖ్యులు చంద్రశేఖర్ తెలిపారు. బెంగళూరు రోటరీ మాన్యతా సహకారం అందిస్తున్నట్టు తెలిపారు. బికామ్, బిబిఎ, బిసిఎ ఇలా ఏ డిగ్రీ పూర్తి చేసినవారైనా మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని 40కుపైగా కంపెనీలు 500కుపైగా పోస్టులను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. మాండోవి మోటర్స్, ఎల్అండ్ టి ఫైనాన్స్, ముత్తూట్ ఫైనాన్స్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆల్‌సెక్ టెక్నాలజీస్, కెబిఎల్ సర్వీసెస్ లిమిటెడ్, డిబిఎస్ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, ఐసిఐసిఐ బ్యాంక్, బిగ్‌బాస్కెట్ తదితర సంస్థలు పాల్గొంటున్నాయన్నారు.

విద్యార్థుల గ్రామ అధ్యయనం

శిడ్లఘట్ట, ఆగస్టు 28: తాలూకాలోని దేవరమళ్ళూరు గ్రామం లో పట్టు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఫైనలియర్ విద్యార్థులు గ్రామస్థులతో కలసి గ్రామీణ మౌల్యమాపన, అధ్యయనంలో పాల్గొన్నారు. గ్రామ బ్లూ ప్రింట్, వనరులకు సంబంధించిన వివరాలు, ట్రాఫిక్, ఇతరత్రా వివరాలతో ఒక ప్రత్యేక నమూనాను సిద్ధం చేశారు. మట్టి, రాయి, పూలు, కూరగాయలు, తదితర పండ్లకు వాటికి అనుగుణమైన రంగులు వేశారు. చెరువులు, కుంటలు, అటవీ ప్రదేశాలు, ఇతర ప్రాంతాలను వేర్వేరుగా గుర్తించారు. పట్టు విశ్వ విద్యాల జీవశాస్త్ర ప్రాధ్యాపకులు డాక్టర్ మంజునాథ్‌గౌడ, డాక్టర్ పల్లవి, దేవరమళ్ళూరు గ్రామపంచాయతీ సభ్యుడు వెంకటేశ్, నంజుండప్ప, రాకేశ్ ద్యావప్ప, రైతులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గ్రామపంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామ అభివృద్ధి నమూనాను పరిశీలిస్తున్న విద్యార్థులు

ప్రామాణికతతో ధర్మరక్షణ

శిడ్లఘట్ట, ఆగస్టు 28: సమాజంలో అందరికీ న్యాయం లభించాలంటే ఆయా వృత్తులవారు తమ విధి నిర్వహణలో ప్రామాణికత, నైతికత పాటించడం ద్వారా ధర్మరక్షణ సాధ్యమని సీనియర్ సివిల్ న్యాయమూర్తి మహ్మద్ రోషన్ షా అభిప్రాయపడ్డారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక సమావేశం నిర్వహించి న్యాయవాదులకు భగవద్గీత పుస్తకాలను బహూకరించి సీనియర్ న్యాయవాది అశ్వత్‌నారాయణను ఆత్మీయంగా సత్కరించారు. తాలూకా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎ నారాయణస్వామి, చంద్రశేఖర్‌లు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. రామాయణ, మహాభారతాల ద్వారా ఎన్నో గుణపాఠాలు నేర్చుకుని జీవితానికి అన్వయం చేసుకుని చక్కటి మార్గంలో సాగాలని అభిప్రాయపడ్డారు. జూనియర్ సివిల్ న్యాయమూర్తి పూజా, న్యాయవాదులు పాపిరెడ్డి, భాస్కర్, చంద్రశేఖర్, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సీనియర్ సివిల్ న్యాయమూర్తి మహ్మద్ రోషన్ షా

కారు మబ్బుల్లో శక్తి కేంద్రం

రాష్ట్రమంతటా రెండు నెలలకుపైగా వరుణుడు కుమ్మేస్తున్నాడు. బెంగళూరులో భారీ వర్షాలు లేకున్నా అడపాదడపా కరుణిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం కారు మబ్బుల్లో శక్తికేంద్రం (విధానసౌధ, వికాససౌధ) ప్రత్యేకంగా కనిపించింది. అంతకుముందు కొన్ని చోట్ల ఆకాశంలో ఇంద్రధనస్సు కనిపించింది.

(బెంగళూరు, ఆంధ్రజ్యోతి)



పుంజుకుంటున్న పాలసమాఖ్య

బంగారపేట, ఆగస్టు 28: పలు కారణాలతో నష్టాలలో ఉన్న కోలారు పాల సమాఖ్య ప్రస్తుతం క్రమేపీ ఆర్థికంగా పుంజుకుందని కోచిముల్ డైరెక్టర్ జయ సింహ కృష్ణప్ప తెలిపారు. రైతులకు పాలధర పెంచడంతోపాటు పలు సాధనాలు ఇచ్చేస్థాయికి చేరిందన్నారు. తాలూకాలోని బూదికోటె గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం వార్షిక సామాన్యసభను ప్రారంభించి మాట్లాడారు. డెన్మార్క్ రాణి బహుమతిగా ఇచ్చిన పది ఆవులకు మరో పది ఆవునుల కొనుగోలు చేసి క్షీర విప్లవాన్ని సృష్టించిన కృష్ణప్ప సేవలను ప్రస్తుతించారు. నిత్యం 12 లక్షల లీటర్ల పాలు దిగుబడి ఉండగా అందులో 10 లక్షల లీటర్ల పాలను పొడిగా మారుస్తున్నామని ప్రతి కేజీ పాల పొడికి రూ.36 ఖర్చు అవుతుండగా మార్కెట్‌లో కేవలం రూ.32కే విక్రయిస్తున్నట్టు తెలిపారు. దీనికితోడు నిత్యం 2లక్షల లీటర్లుమిగులుతో నష్టం చవిచూడాల్సి ఉంటోందన్నారు. పాల సమాఖ్యకు సుమారు రూ.100 కోట్ల దాకా రావాల్సి ఉందని దీంతో పలు పథకాలు తాత్కాలికంగా అమలు చేయ లేదన్నారు. ఇదే సందర్భంగా ముగ్గురు రైతులను సత్కరించారు. సంఘం అధ్యక్షుడు మంజు నాథ, ఉపాధ్యక్షుడు నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.



పాడిరైతులకు సన్మానిస్తున్న కోచిముల్ డైరెక్టర్ జయసింహకృష్ణప్ప తదితరులు

పార్యపుస్తకాలలో నిజలింగప్ప, కెంగల్ అంశాలు చేర్చాలి

» సీఎంకు కేంద్రమంత్రి సోమణ్ణ వినతి

బెంగళూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనడంతోపాటు సమైక్య కర్ణాటకకోసం పాటుపడిన మాజీ ముఖ్యమంత్రులు ఎస్ నిజలింగప్ప, కెంగల్ హనుమంతయ్యల సేవలు మరువలేనివని వారి చరిత్రలు హైస్కూల్ స్థాయి పాఠ్యపుస్తకాలలో చేర్చాలని కేంద్రమంత్రి సోమణ్ణ కోరారు. ఈమేరకు సీఎం సిద్దరామయ్యకు ప్రత్యేకంగా వినతిపంపారు. సమైక్య కర్ణాటక ఆవిర్భావమై 75ఏళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా జరుగుతున్న ఉత్సవాలలో ప్రముఖుల సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వారి జయంతులను ప్రభుత్వం ద్వారానే జరపాలని బెంగ ళూరు విశ్వవిద్యాలయంలో కెంగల్ హనుమంతయ్య, దావణగెరె యూనివర్సిటీలలో నిజలింగప్పల పేరిట అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈమేరకు బుధవారం మంత్రి సోమణ్ణ మీడియాతో మాట్లాడుతూ కెంగల్ హనుమంతయ్య, నిజలింగప్పల సేవలు యువత స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఓల్డేజ్ హోంలలో నాణ్యత పెంచాలి



సీనియర్ హోం కేర్ ప్రారంభంలో ప్రముఖులు

బొమ్మనహళ్ళి, ఆగస్టు 28: నగరంలోని చాలా ఓల్డేజ్ హోంలలో నాణ్యత పెంచాల్సిన అవసరం ఉందని బిలియన్ మ్యాక్స్ గ్రూప్ పేర్కొంది. బన్నేరుఘట్ట రోడ్డులోని అంటారా సీనియర్ హోం కేర్‌ను ప్రారంభించారు. ఉత్తర భారతదేశంలో అంటారా హోంకేర్‌ల ద్వారా 60 వేల మందికి పైగా జీవన విధానం మార్చిందని సంస్థ నిర్వాహకులు తెలిపారు. వృద్ధులు సేదతీరేందుకు అవసరమయ్యే పరుపులు, మంచాలు నాణ్యమైనవి ఉన్నాయన్నారు. బెంగళూరు, చెన్నై వంటి నగరాలలో ఓల్డేజ్ హోంలకు అవసరమైనవి సమకూర్చేందుకు తాము సిద్ధంగా ఉన్నట్టు సీఈఓ రజిత్ మెహతా తెలిపారు.

పాము కాటుతో బాలుడి మృతి



దేవరాజు (ఫైల్)

దొడ్డబళ్ళాపుర ఆగస్టు 28: పాఠశాలకు బయల్దేరిన బాలుడు పాము కాటుకు గురై మృతి చెందిన సంఘటన దొడ్డ బళ్ళాపుర తాలూకాలో చోటు చేసుకుంది. పురుషనహళ్ళికి చెందిన చంద్రశేఖర్ కుమారుడు దేవరాజు (15) పాము కాటుకు గురయ్యాడు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు పాఠశాలకు వెడుతూ మార్గమధ్యంలో టెంకాయలు కోసేందుకు యత్నించాడు. ఏదో కుట్టినట్టు కావడంతో నొప్పి తట్టుకోలేక ఇంటికి వాపసు వచ్చాడు. గ్రామస్తులు ఏదైనా పురుగు కుట్టు ఉంటుందని నాటు మందును తాపించారు. అయితే బుధవారం తెల్లవారు జామున ఐదు గంటలకు విషం వ్యాపించి దేవరాజు మృతి చెందాడు. వైద్యులు పరిశీలించగా పాము కాటుకు గురై మృతి చెందాడని నిర్ధారించారు. దొడ్డబెళ వంగల పోలీసులు అసహజ మృతిగా కేసు నమోదు చేసుకున్నట్టు ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు.

గేర్‌బాక్స్ పడి మెకానిక్ మృతి



మన్సూర్ (ఫైల్)

దేవనహళ్లి రోడ్డులోని జేకే పెయింట్స్ సమీపాన లారీ మెకానిక్ గ్యారేజ్‌ను జోగహళ్ళికి చెందిన మన్సూర్ (40) నిర్వహిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం లారీ గేర్ బాక్స్ విప్పుతున్న వేళ అదుపు తప్పి మన్సూర్ తలపై పడింది. తీవ్రంగా గాయపడిన అతడిని మణిపాల్ ఆసు పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిమ్హాన్స్‌కు తీసుకెళ్లాలని సూచించారు. నిమ్హాన్స్‌లో వెంటి లేటర్ వ్యవస్థ లేదని అక్కడివారు సూచించడంతో మరో ఆసుపత్రికి తీసుకెళ్లే యత్నంలో తీ వ్ర రక్తస్రావానికి గురైన మన్సూర్ మృత్యు వాత చెం దా డు. దొడ్డ బళ్ళాపుర రూర ల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

టమోటా కిలో రూ.23

అనంతపురం రూరల్, ఆగస్టు 28: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. బుధవారం 3800 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.15, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు వివరించారు.

చీనీ కాయలు టన్ను రూ.24వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 28: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.24వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 101 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు. 10 టన్నులు కొనుగోలు: మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో పది టన్నుల టమోటా కొనుగోలు జరిగినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి తెలిపారు. బుధవారం కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో రూ.10తో పది టన్నులు కొనుగోలు చేసి విజయవాడకు తరలించినట్లు తెలిపారు.

పీఠం కదులుతోందా..!

స్టాండింగ్ కమిటీ ఎన్నికల ముసుగులో పావులు.. పసిగట్టి అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే అనంత


అనంతపురం క్రైం, ఆగస్టు 28: వైసీపీ నాయకులకు నగరపాలిక కార్పొరేటర్లు ఎక్కడ జారిపోతారోనని బెంగ పట్టుకుంది. మేయర్ పదవిపై కన్నేసిన ఆ పార్టీలోని ఇద్దరు ముగ్గురు కార్పొరేటర్లు.. వారం రోజులుగా బేరసారాలు సాగిస్తున్నారని సమాచారం. గంపగుత్తగా టీడీపీలోకి చేరడం ద్వారా మేయర్ పీఠాన్ని చేజిక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలను ఇందుకు వాడుకోవాలని చూశారు. మాజీ ఎంపీ అనుచరుడి ద్వారా కార్పొరేటర్లకు గాలం వేశారు. పార్టీ మారితే ఒక్కొక్కరికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు ఇస్తామని బేరం పెట్టినట్లు తెలిసింది. కొందరు దీనికి సై అన్నట్లు సమాచారం. మరికొందరు ఎక్కువ డబ్బులు డిమాండ్ చేశారని తెలిసింది. దీంతో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి జోక్యం చేసుకుని బేరసారాలకు అడ్డుకట్ట వేశారని ప్రచారం జరుగుతోంది. పార్టీ మారే ఆలోచన చేస్తే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని అధినాయకత్వం ద్వారా బెదిరించారని సమాచారం. ఈ క్రమంలో కొందరు కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమై.. వెనకడుగు వేశారని అంటున్నారు.

గంటన్నర ముందు నామినేషన్లు

స్టాండింగ్ కమిటీ ఎన్నికలలో నామినేషన్లు వేయడానికి మూడు రోజులు గడువు ఇచ్చారు. అయినా చివరి రోజు, అందులోనూ గంటన్నర ముందు నామినేషన్లు వేశారు. ఈ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే అనంత చక్రం తిప్పినట్లు తెలిసింది. ఎవరెవరు నామినేషన్లు వేస్తారో బుధవారం మధ్యాహ్నం వరకు తెలియకుండా జాగ్రత్తపడినట్లు తెలిసింది. పాలకవర్గంలోని టాప్ త్రీలో ఒకరికి చివర్లో ఆ ఐదుగురి జాబితా తెలిసినట్లు సమాచారం. చివరకు కార్పొరేటర్లు సుజాత, నాగ వినీత, నరసింహులు, అనిల్‌కుమార్ రెడ్డి, రహంతుల్లా నామినేషన్లు దాఖలు చేశారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్‌రెడ్డి, సాహిత్య సమక్షంలో వీరు నామినేషన్లు దాఖలు చేశారు. వీరు ఏకగ్రీవం కానున్నారు. ఇదివరకు స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఉన్న నలుగురు కార్పొరేటర్లు మరోసారి తాము నామినేషన్ వేస్తామని అడిగినట్లు తెలిసింది. దీంతో ప్రతిసారీ వారేనా..? కొత్తవారికి అవకాశం ఇవ్వాలని వాదించారట.



అనంతపురం కార్పొరేషన్ కార్యాలయం



నామినేషన్ వేస్తున్న వైసీపీ కార్పొరేటర్లు